# నమస్తే తెలంగాణ
# పెద్దపల్లి
5 | కరీంనగర్, ఆదివారం 16 ఫిబ్రవరి 2025 | PEDDAPALLI


## వృక్షార్చనతో శుభాకాంక్షలు తెలుపుదాం

మాజీ ఎమ్మెల్యే రవిశంకర్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, నాయకులు

బోయినపల్లి (వేములవాడ), ఫిబ్రవరి 15: (ఈ నెల 17న రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా వృక్షార్చనతో శుభాకాంక్షలు తెలుపుదామని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పిలుపునిచ్చారు. శనివారం బోయినపల్లి మండల కేంద్రంలో వృక్షార్చన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేసీఆర్ జన్మదినం సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా చేపట్టిన (హరిత సేన వృక్షార్చన) కార్యక్రమంలో పాల్గొని పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఆజ్జు, సోషల్ మీడియా కన్వీనర్ బత్తిని కమల్ గౌడ్ పాల్గొన్నారు.

## ఈసారైనా తులం బంగారం ఇస్తారా?

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్న


వీణవంకలో కల్యాణలక్ష్మి దరఖాస్తులపై సంతకాలు చేస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, ఫిబ్రవరి 15 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇప్పటికైనా ఇస్తారా? లేదా? అని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు. మండల కేంద్రంలోని తన నివాసంలో కల్యాణలక్ష్మి దరఖాస్తులపై సంతకాలు చేస్తున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకం మాత్రమే ఇప్పటికీ అమలవుతున్నదని స్పష్టం చేశారు. తాను ఎమ్మెల్యే అయినప్పటి నుంచి 1000కి పైగా కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశానని, ప్రభుత్వ హామీ తులం బంగారం మాత్రం ఎవరికీ రాలేదన్నారు. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత ఎంతమందికి వివాహాలు జరిగాయో అందరికీ తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జమ్మికుంట పట్టణం, జమ్మికుంట రూరల్, ఇల్లందకుంట, వీణవంకకు సంబంధించిన 300కు పైగా కల్యాణలక్ష్మి దరఖాస్తులపై సంతకాలు చేసినట్లు తెలిపారు.ప్రభుత్వం ప్రజలను ఎన్ని రోజులు మోసం చేస్తుందని తులం బంగారం హామీ అమలు చేయకపోతే బహిరంగ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## చివరి ఆయకట్టుకు నీళ్లేవి..?

- ఎస్సారెస్పీ కాకతీయ ఎగువ ప్రధాన కాలువలో అంతంతే సరఫరా
- రేవెల్లి వరకు రావాల్సిన 3,700 క్యూసెక్కుల్లో 2,950 రాక
- పైన వాడుకోగా మిగిలినవే కిందికి
- పిల్ల కాలువలకు సరిపోని నీళ్లు
- టేలెండ్‌లో ఎండుతున్న పొలాలు
- రైతుల మధ్య గొడవలకు దారి తీస్తున్న పరిస్థితులు
- అధికారుల పర్యవేక్షణ ఏమైనట్లు..?

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టు తడారిపోతున్నది. వేసవికి ముందే నీరందక తల్లడిల్లుతున్నది. కాకతీయ ఎగువ ప్రధాన కాలువ ద్వారా సరిపడా నీరు రాకపోవడంతోనే మైనర్ కెనాళ్లలో పారక పొలాలు ఎండిపోయే దుస్థితి దాపురించిందని దిగువ కర్షకులు వాపోతున్నారు. పైన వాడుకోగా మిగిలినవే కిందికి సరఫరా అవుతున్నాయని, అవి కూడా కొద్ది మొత్తమే కావడంతో తమ వరకూ అందడం లేదని ఆందోళన చెందుతున్నారు. చొప్పదండి మండలం వెదురుగట్ట వద్ద డిస్ట్రిబ్యూటరీ నుంచి తమకు సరిపడా నీళ్లు రాకుండా పైన గ్రామాల రైతులు అడ్డుకుంటున్నారని, పర్యవేక్షించాల్సిన యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తున్న సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లోని పలు గ్రామాల రైతులు, ఇటీవల ఎగువన తూములు కట్టి నీళ్లు తీసుకెళ్లే ప్రయత్నం చేయగా అడ్డుకున్న స్థానిక రైతులతో గొడవకు దిగినట్లు తెలుస్తున్నది. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించాల్సి ఉంది.

- కరీంనగర్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ)


కరీంనగర్ మండలం చామన్‌పల్లిలో ఎస్సారెస్పీ 11ఆర్ కాల్వలో అరకొరగా నీళ్లు


చామన్‌పల్లిలో నీరు లేక నెర్రెలు వారిన పొలం

కరీంనగర్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగి నీళ్ల కోసం రైతులు గొడవలకు దిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రధాన కాలువలకు సరిపడా ఇవ్వడం లేదు. ఇచ్చిన నీటిని పైన ఉన్న రైతులు వాడుకోగా మిగిలినవి వదిలితే చివరి ఆయకట్టుకు చేరకపోవడం, కింది రైతులు కాలువలపై తిరుగుతూ గేట్లు మూసి వేయడం, తూములు కట్టేయడం వంటి చర్యలకు పూనుకుంటున్నారు. ప్రాజెక్టు పరిధిలోని ఎగువ కాకతీయ కాలువకు గత డిసెంబర్ 25 నుంచి ఆన్ ఆఫ్ పద్ధతిలో డీ-54 నుంచి డీ-94 వరకు నీటిని విడుదల చేస్తున్నారు. విడుదల చేసిన ప్రతిసారి 5,500 క్యూసెక్కులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నీళ్ల పైన ఉన్న డిస్ట్రిబ్యూటర్లు వాడుకోగా దిగువన డీ-86, డీ-94 వరకు 3,700 క్యూసెక్కులు రావాల్సి ఉంటుంది. కానీ చొప్పదండి మండలం రేవెల్లిలోని డిస్ట్రిబ్యూటరీల వరకు కేవలం 2,950 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. అంటే 750 క్యూసెక్కుల నీటి కొరత ఏర్పడుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయా డిస్ట్రిబ్యూటర్ల పరిధిలోని పిల్ల కాలువలకు విడుదల చేసే నీరు ఎటూ సరిపోవడం లేదు. నిజానికి పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, కాల్వ శ్రీరాంపూర్, ఓదెల మండలాలకు నీటిని తరలించే డీ-86 కాలువకు 1,100 క్యూసెక్కులు విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ 960 క్యూసెక్కులు మాత్రమే కాలువల ద్వారా వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ నీటిని కాలువ పైన ఉన్న రైతులే ఎక్కువగా వాడుకుంటున్నారని, చివరి ఆయకట్టు రైతులు వాపోతున్నారు. అయితే పైన ఉన్న గ్రామాల రైతులు కూడా తమకు సరిపోవడం లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో చివరి ఆయకట్టు రైతులు కాలువలపై తిరుగుతూ తూములు మూస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల రైతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మూడు రోజుల కింద చొప్పదండి మండలం వెదురుగట్ట డిస్ట్రిబ్యూటరీ వద్ద ఇదే జరిగింది. సుల్తానాబాద్, ఓదెల మండలాల రైతులు ఈ గ్రామానికి వచ్చి తమకు నీళ్లు రాకుండా అడ్డుకుంటున్నారని స్థానిక రైతులతో గొడవకు దిగినట్లు తెలుస్తోంది.

### అధికారుల పర్యవేక్షణ ఏమైంది..?

చివరి ఆయకట్టు వరకు నీరు అందే విషయంలో అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి. కానీ పై నుంచి సరిపడా నీళ్లు రాకపోవడంతో అధికారులను సైతం రైతులు ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన కాలువ ద్వారా వచ్చే నీటికి ఎగువ ప్రాంతంలోనే గండి పడుతున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రధాన కాలువకు 5,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారా..? లేదా..? అనేది తేలడం లేదు. ఒక వేళ అంతే మొత్తంలో వదిలితే రేవెల్లి వరకు 3,700 క్యూసెక్కులు వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎందుకు ఉపేక్షిస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రధాన కాలువకు, ఆ తర్వాత డిస్ట్రిబ్యూటరీలకు సరిపడా నీరు వచ్చినప్పుడే పిల్ల కాలువలకు పూర్తి స్థాయిలో అందుతుందని రైతులు చెబుతున్నారు. అయితే చివరి ఆయకట్టుకు నీళ్లందించేందుకు చొప్పదండి మండలం కోనేరుపల్లి వద్ద గేట్లు మూసి హెడ్ బిల్డప్ చేస్తున్నారు. ఇక్కడ నీళ్లు ఆపి ఒక్కసారిగా వదిలితే ప్రవాహం పెరిగి చివరి ఆయకట్టుకు నీళ్లు వెళ్తాయనేది అధికారుల ఉద్దేశం. కానీ ఈ ప్రయత్నం కూడా పూర్తి స్థాయిలో సఫలం అవడం లేదని రైతులు పడుతున్న కష్టాలను బట్టి తెలుస్తోంది. అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ జరిపి, ఆయా కాలువల ఆయకట్టును, దూరాన్ని బట్టి నీటిని విడుదల చేయాల్సిన అవసరం ఉందని రైతులు చెబుతున్నారు.

### ఇంకా మిగిలింది మూడు తడులే..!

ఎగువ కాకతీయ కాలువ పరిధిలోని డీ-54 నుంచి డీ-94 వరకు ఈ యాసంగి సీజన్‌లో ఇంకా మూడు తడులకు మాత్రమే నీరు ఇవ్వాల్సి ఉంటుంది. గత డిసెంబర్ 25 నుంచి ఇప్పటి వరకు నాలుగు విడతలు ఇచ్చారు. డిసెంబర్ 25 నుంచి జనవరి 2 వరకు ఒకటి, జనవరి 9 నుంచి 17 వరకు రెండు, జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు మూడు తడులు పూర్తయ్యాయి. ఫిబ్రవరి 8 నుంచి నాలుగో విడత కొనసాగుతోంది. ఈ నెల 16 వరకు వస్తుంది. మిగిలిన మూడు తడులు ఫిబ్రవరి 23 నుంచి మార్చి 3 వరకు, మార్చి 10 నుంచి 18 వరకు, మార్చి 25 నుంచి ఏప్రిల్ 2 వరకు ఇవ్వనున్నారు. అయితే, అప్పటి వరకు ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గుతుందని, మిగిలిన మూడు తడులకు ఇంకా నీరు తగ్గించవచ్చని, ఈ నేపథ్యంలో తమ భూములకు నీరందే పరిస్థితి ఉండక పోవచ్చని చివరి ఆయకట్టు రైతులు వాపోతున్నారు. అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ జరిపి రైతుల మధ్య సమన్వయం కొరవడకుండా చర్యలు తీసుకోవల్సిన అవసరం ఉంది.


నీరులేక ఎండిపోయిన మక్క

## కాంగ్రెస్ అంటేనే మోసం

- ప్రజలను వంచించడం వెన్నతో పెట్టిన విద్య
- ఆ పార్టీది ఢిల్లీ నుంచి గల్లీ దాకా ఒకటే నైజం
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ధ్వజం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, ఫిబ్రవరి 15: కాంగ్రెస్ అంటేనే మోసమని, ప్రజలను వంచించడం ఆ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. మంథనిలోని రాజగృహలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి నట్టేట ముంచడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిపోయిందని, ఢిల్లీ నుంచి గల్లీ దాకా వారిది ఒకటే నైజమని ధ్వజమెత్తారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేందుకు లెక్కలేనన్ని అబద్ధాలు ఆడిన సీఎం రేవంత్‌రెడ్డినే తలదన్నేలా మంథని నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు వ్యవహరిస్తున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 'మన తాత ముత్తాతలకు సంబంధించిన సంపదను దోచుకెళ్తున్నారని, తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక రవాణాను పూర్తిగా అడ్డుకుంటామని' ప్రజలకు దొంగ హామీ ఇచ్చిన శ్రీధర్ బాబు, మరీ ఏడాది గడుస్తున్నా రవాణాను ఎందుకు ఆపలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఊసరవెల్లిలా రంగులు మార్చడం శ్రీధర్‌బాబుకే సాధ్యమని దుయ్యబట్టారు. నాడు ఇసుక పాలసీ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగేదని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 24 గంటల పాటు నిర్వహించుకోవచ్చని ఉత్తర్వులు జారీ చేశారని విమర్శించారు. లారీలు బంద్ చేయించడం మాట పక్కన పెడితే 24 గంటలు నడుపుకోవడానికి అనుమతులు ఇవ్వడం చూస్తుంటే ఇందులో ఎంత అక్రమంగా సంపాదిస్తున్నారనే విషయాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. పెద్దపల్లి, భూపాలపల్లి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు గోదావరి, మానేరు నదుల్లో ఇసుకను తరలించకుండా అడ్డుపడుతుంటే, మంత్రిగా ఉన్న శ్రీధర్ బాబు మాత్రం తన సొంత నియోజకవర్గంలో జోరుగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నా ఆపడం లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, మాచీడి రాజుగౌడ్, వెల్పుల గట్టయ్య, కాయితీ శ్రీనివాస్, పెగడ శ్రీనివాస్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తులపై ఇంటలిజెన్స్ ఆరా

గంగాధర, ఫిబ్రవరి 15 : మండల కేంద్రంలో ఓ జిరాక్స్ సెంటర్‌లో మండలంలోని కాసారం గ్రామానికి చెందిన ప్రజాపాలన దరఖాస్తులు దర్శనమిచ్చిన వార్తా కథనం గత మూగు రోజుల క్రితం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన విషయం తెలిసిందే. కాగా, ఈ ఘటనపై ఇంటలిజెన్స్ అధికారులు ఆరా తీశారు. దరఖాస్తులు జిరాక్స్ సెంటర్‌లోకి ఎలా వచ్చాయి?, వాటిని ఎవరు తీసుకువచ్చారు? అన్న విషయాల గురించి జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడిని, రెవెన్యూ సిబ్బంది నుంచి వివరాలను సేకరించినట్లు ఇంటలిజెన్స్ అధికారి ప్రకాశ్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచే దరఖాస్తులు జిరాక్స్ సెంటర్‌కు తీసుకువచ్చినట్లు తెలిసిందని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో మ్యాన్ పవర్ తక్కువగా ఉండడంలో జిరాక్స్ సెంటర్‌కు పంపించినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ పాడై.. పొలం ఎండి

- ముస్తఫానగర్‌లో కరెంట్ సమస్య
- నీరందక మాడిపోతున్న పంటలు
- ఆవేదనలో రైతులు


ముస్తాఫానగర్‌లో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో కరెంటు లేక ఎండిన పొలాలను చూపిస్తున్న రైతులు

గంభీరావుపేట, ఫిబ్రవరి 15: రైతన్నను సమస్యలు వెంటాడుతున్నాయి. ఓవైపు సాగునీటి కొరత.. మరోవైపు కరెంట్ వ్యథలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇందుకు గంభీరావుపేట మండలం ముస్తఫానగరే నిదర్శంనగా నిలుస్తున్నది. ఇక్కడ వ్యవసాయ విద్యుత్‌కు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్‌పై ఓవర్ లోడ్ పడుతుండడంతో తరచూ కాలిపోతున్నది. ఫలితంగా కరెంట్ లేక ఇక్కడి రైతులు పొలానికి నీరు పారించుకోలేని పరిస్థితి దాపురించింది. మూడు రోజుల క్రితం సైతం కాలిపోగా, ఇప్పటికీ మరమ్మతులు చేయకపోవడం, పంటలకు నీరందక ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసన తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి ఓవర్ లోడ్ సమస్యను పరిష్కరించాలని, ట్రాన్స్ ఫార్మర్‌కు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు శివది దేవయ్య, అక్బర్, దేవేందర్, దోమకొండ రాజయ్య, కృష్ణకాంత్, శ్రీనివాస్, భూమయ్య, రాములు, నర్సయ్య, కంటె దేవయ్య తదితరులు ఉన్నారు.

రామగిరి : తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతులు



## మేం భూములివ్వం

- పోరాటానికి రత్నాపూర్ రైతులు సన్నద్ధం!
- ఇండస్ట్రియల్ పార్క్ కోసం 243.29 ఎకరాల సేకరణకు రంగం సిద్ధం చేసిన అధికారులు
- రైతుల భూములు 203.31 ఎకరాలు.. ప్రభుత్వ భూములు 39.38 ఎకరాలు
- సర్వే కోసం వచ్చిన అధికారులను మొదట్లోనే అడ్డుకుని తిరిగి పంపించిన రైతులు
- మాటా ముచ్చట లేకుండానే భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ
- ఆందోళనతో బొడ్రాయికి, తహసీల్దార్‌కు రైతుల వినతి

రాష్ట్ర ప్రభుత్వం రామగిరి మండలం రత్నాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం భూములు సేకరించడానికి సిద్ధమవుతుండగా.. తమ బతుకులకు భరోసాగా ఉన్న భూములను కాపాడుకోవడానికి గ్రామస్తులు పోరాటానికి సిద్ధమవుతున్నారు. మేడిపల్లి రెవెన్యూ శివారులోగల రత్నాపూర్ రైతులు తమ పంట భూములు ఇచ్చేదే లేదని తేల్చి చెబుతున్నారు. ఇప్పటికే తమ గ్రామం నుంచి నాలుగుసార్లు భూములు ఇచ్చామని, మళ్లీ ఇచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు.


రత్నాపూర్ శివారులోని మేడిపల్లి పొలాలు

రామగిరి / కమాన్‌పూర్, ఫిబ్రవరి 15 : ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం రామగిరి మండలంలోని రామగిరిఖిల్లాకు వెళ్లే దారిలో గల మేడిపెల్లి శివారులోని 243.29 ఎకరాల భూమిని సర్వే చేయడానికి గతేడాది నవంబర్‌లో తహసీల్దార్‌తో పాటు సర్వేయర్లు రత్నాపూర్ గ్రామంలోకి వెళ్లారు. దీంతో గ్రామ రైతులు వారిని అడ్డగించి, సర్వే చేయనీయకుండా వెనక్కి పంపించారు. ఆ తర్వాత వారు మళ్లీ ఫీల్డ్ మీదకు రాలేదు. కనీసం రైతులతో మాటా మంతీ కూడా చేయకపోవడంతో ఇండస్ట్రియల్ పార్కుకు భూసేకరణ ప్రక్రియ నిలిచిపోయిందనుకుని ఊపిరి పీల్చుకున్నారు.

### అనూహ్యంగా నోటిఫికేషన్ జారీ?

రత్నాపూర్ రైతులు ఊహించని విధంగా ఇండస్ట్రియల్ ఫార్క్ ఏర్పాటు కోసం 243.29 ఎకరాల భూమిని సేకరిస్తామని ఈ నెల 11న పెద్దపల్లి కలెక్టర్ ద్వారా నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఇందులో రైతులకు సంబంధించిన 61 సర్వే నెంబర్లలోని 203.31 ఎకరాల్లో ఎలాంటి లావాదేవీలు నిర్వహించవద్దని వెల్లడించారు. అలాగే, మిగతా 140, 142, 143, 156 సర్వే నంబర్లలోని 39.38 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించనున్నట్లు తెలిపారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన నోటీస్‌ను మండల ప్రజా పరిషత్, తహసీల్దార్, రత్నాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోని నోటీస్ బోర్డులో అంటించారు. ఈ భూమి ప్రణాళికలను మంథని కార్యాలయంతో పాటు కలెక్టరేట్‌లో ఉంచారు.

### రైతుల్లో ఆందోళన

ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూసేకరణ ప్రక్రియకు నోటిఫికేషన్ జారీ కావడంతో బాధిత రైతుల్లో ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో తమ పంట భూములు ఎట్టి పరిస్థితుల్లో ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెబుతూ గ్రామ నడిబొడ్డున బొడ్రాయి విగ్రహానికి వినతి పత్రం అందజేసి వినూత్న నిరసన తెలిపారు. అలాగే, రామగిరి మండల తహసీల్దార్‌కు కూడా వినతి పత్రం అందజేశారు. సిరులు పండే పంట భూములను తమ నుంచి లాక్కొని బిచ్చం ఎత్తుకునే పరిస్థితికి తీసుకు రావాలనుకుంటే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే తమ ఊరుకు చెందిన పంట భూములు తీసుకున్నారని, మళ్లీ అదే పరిస్థితి తెచ్చేలా చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూములను వదులుకోవడానికి సిద్ధంగా లేమని, ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నారు.

### ఇప్పటికే పలుమార్లు భూ సేకరణ

రత్నాపూర్ గ్రామస్తులు ఇప్పటికే సింగరేణి క్వాటర్లు, గ్యాస్ పైప్ లైన్, మంథని టూ టీఎంసీ వాటర్ పైప్‌లైన్, విద్యుత్ హై లెవెల్ స్తంభాల నిర్మాణం కోసం ఇప్పటికే 150 ఎకరాల భూములు ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ ఇండస్ట్రియల్ పార్క్ కోసం అంటూ తమ భూములు లాక్కోవాలని చూస్తే ఎలా సహిస్తామని బాధిత రైతుల ప్రశ్నిస్తున్నారు. త్యాగానికి అంటూ ఒక హద్దు ఉంటుందని, పదే పదే ఒకే గ్రామానికి చెందిన వారే త్యాగాలు చేయాలంటే ఎలా చేస్తారంటూ నిలదీస్తున్నారు.

### సింగరేణి మిగులు భూములు ఉన్నా..!

సింగరేణి సంస్థ విస్తరణలో భాగంగా ప్రభుత్వ, పట్టాకు సంబంధించిన వేలాది ఎకరాల భూములను అప్పట్లోనే స్వాధీనం చేసుకుంది. వీటిలో ఇంకా మిగులు భూములు వందలాది ఎకరాలు ఉన్నాయి. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం అవసరమైన స్థలాన్ని సింగరేణి మిగులు భూముల్లో ఏర్పాటు చేస్తే బాగుంటుందని రైతులు సూచిస్తున్నారు. గతంలో సింగరేణి సంస్థకు సంబంధించిన భూముల్లో జేఎన్‌టీయూ ఏర్పాటు చేసిన విధంగా ప్రస్తుతం కూడా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయవచ్చు కదా! అంటూ చెబుతున్నారు.

### బంగారం పండే భూమిని ఇచ్చేదే లేదు



నాకు మా గ్రామ పరిధిలోని మేడిపల్లి శివారుల ఐదెకరాల పొలం ఉంది. రెండు పంటలు పండుతది. నేనే సొంతంగా సాగు చేసుకుంటున్న. దిగుబడి కూడా మంచిగ వస్తుంది. కుటుంబ సభ్యులతో ఇన్నాళ్లుగా సంతోషంగా బతుకుతున్నం. కానీ, కాంగ్రెస్ సర్కారు వచ్చినంక కష్టాలు మొదలైనయ్. ఏదో కంపెనీ వస్తుందని చెప్పాపెట్టకుండానే గ్రామ పంచాయతీ ఆఫీస్ కాడ గోడకు కాగితాలు అతికించిన్రు. అందులో నా పేరుంది. నా భూమి కంపెనీనోళ్లకు అప్పగిస్తరట. ఎవరు వచ్చినా బంగారు పంటలు పండే భూమిని మాత్రం ఇవ్వను.

- బర్ల వెంకన్న, రైతు (రత్నాపూర్)

### చావో రేవో తేల్చుకుంట



నాకు మూడెకరాల పొలం ఉంది. కంపెనీ కోసం నా భూమిని గుంజుకుంటరట. వరి వేసుకొని బతుకుతుంటే ఏదో కంపెనీ కోసం భూములు అడుగుతున్నరు. నా భూమి ఎందుకిస్త. ప్రభుత్వంతో చావో రేవో తేల్చుకుంట రేవంత్‌రెడ్డి వచ్చినంక మా రైతులకు కష్టాలు ఎదురైనయ్. దరిద్రం దాపురించింది.

- కండె కొమురయ్య, రైతు (రత్నాపూర్)


